
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 కర్నూలు జిల్లా వార్తలు

సోమవారం 20 మే 2024



సాగుకు సాయం చేస్తారా..?

- విత్తనాలు, ఎరువులు, యంత్రాలకు ఎదురు చూపులు
- ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు అధికారుల నిర్లక్ష్యం
- ప్రభుత్వ అండ లేదని రైతుల ఆక్రందన
- కౌలు రైతులను పట్టించుకునేవారేరీ?



కర్నూలు(అగ్రికల్చర్), మే 19:

వ్యవసాయమంటే కష్టాలు కడగండ్లే. సేద్యం చేసి లాభపడిన వాళ్లెవరూ లేరని రైతులు అంటారు. రెండేళ్లుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరో పది రోజుల్లో ఖరీఫ్ సీజన్ మొదలు కానుంది. ఎప్పటిలాగే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా? లేక అండగా ఉంటారా? అని రైతులు ఎదురు చూస్తున్నారు. పంటల సాగుకు అవసరమైన పెట్టుబడిని రైతులకు అందించేందుకు ఏటా కలెక్టర్ ఆధ్వర్యంలో రుణ ప్రణాళికలను ఈపాటికే సిద్ధం చేసేవారు. అయితే.. ఈసారి సాధారణ ఎన్నికల నేపథ్యంలో రుణ ప్రణాళికను తయారు చేయడం ఆలస్యమైందని కర్నూలు జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. త్వరలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పంట సాగు కోసం ఎంత రుణం ఇచ్చేది కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

జిల్లాలో ప్రతి ఏటా వర్షాలు ఎప్పుడు వచ్చేదీ సందేహాస్పదంగా ఉండేది. అయితే గతంలా కాకుండా ఈసారి ఖరీఫ్ సాగుకు అనుకూలంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికార వర్గాలు తెలపడంతో రైతులు ఊరట చెందుతున్నారు. తమకు పంట రుణాలను సకాలంలో అందించడంతో పాటు కల్తీ, నాసిరకం విత్తనాల బెడద నుంచి కాపాడాలని వ్యవసాయ యంత్ర పరికరాలు ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ముఖ్యమైన ఎరువులు యూరియా, డీఏపీ తదితర వాటిని ఆర్‌బీకేల ద్వారా అందించాలని అధికారులను కోరుతున్నారు.

6.20 లక్షల హెక్టార్లలో పంటల సాగుకు సిద్ధం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు 6.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా పత్తి సాగులో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉన్నట్లు అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఖరీఫ్‌లో రెండు జిల్లాల్లో కలిపి ప్రధాన పంటల సాగు వివరాల్లోకి వెళితే.. పత్తి 2.30 లక్షల హెక్టార్లు, వరి 79,018 హెక్టార్లు, కందులు 48,229 హెక్టార్లు, వేరుశనగ 1.42లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 30,154 హెక్టార్లు, జొన్న 14,062 హెక్టార్లు, కొర్ర 13,613 హెక్టార్లు, ఆముదం 54,406 హెక్టార్లు, మిరప 15,567 హెక్టార్లు, ఉల్లి 20,746 హెక్టార్లు, టమోటా 3,500 హెక్టార్లు అన్ని పంటలు కలిపి 6.20 లక్షల హెక్టార్లలో ఈ పంటలు సాగు చేసే అవకాశం ఉంది.

ఈ సారైనా వరుణుడు కరుణించేనా..?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసే పంటలపై అతివృష్టి, అనావృష్టి దాడి చేస్తున్నాయి. రెండు జిల్లాల్లో కలిపి 670 ఎంఎం వర్షం ఖరీఫ్‌లో నమోదు కావాల్సి ఉండగా.. 2022లో సాధారణ వర్షపాతానికి మించి 800 ఎంఎంకు పైగా వర్షాలు పడ్డాయి. దీంతో రైతులు సాగు చేసిన పంటలన్నీ నీట మునిగి రైతులు కోలుకోలేని దెబ్బ తిన్నారు. 2023లో తీవ్ర అనావృష్టి ఫలితాలు రైతుల్ని దెబ్బతీశాయి. 670 ఎంఎం వర్షానికి గాను కేవలం 300 ఎంఎం వర్షం మాత్రమే నమోదైంది. దీంతో పంటలన్నీ మట్టిపాలయ్యాయి. ఈసారి వాతావరణ శాఖ అధికారులు చల్లని కబురు అందించారు. మే నెలాఖరుకే ఎల్నినో ప్రభావం తగ్గిపోయి లానినో ప్రభావం వల్ల వర్షాలు కురుస్తాయని, సాధారణ వర్షాలకు ఢోకా ఉండదని ప్రకటించడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వారం రోజులుగా రెండు జిల్లాల్లో వర్షాలు పడుతుండటంతో రైతులు పంట సాగు కోసం పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ముందస్తుగా విత్తనాలు వేయడం వల్ల అధిక దిగుబడి వచ్చేందుకు అవకాశం ఉంటుందని, తెగుళ్ల కూడా తక్కువగా ఉంటాయని వారు చెబుతున్నారు.

కల్తీ విత్తనాల నుంచి విముక్తి కలిగేనా..?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాణ్యమైన విత్తనాలు రైతులకు అందడమే గగనంగా మారిపోయింది. రైతుల అవసరాలను తమ ప్రయోజనాల కోసమే అన్నట్లుగా వ్యాపారులు జేబులు నింపుకోవడం సాధారణమై పోయింది. ముఖ్యంగా పత్తి 2 లక్షల హెక్టార్లకు పైగా సాగులో ఉన్నా కూడా అవసరమైన బీటీ-2 విత్తనాలు అందించడానికి జిల్లా వ్యవసాయ శాఖ శ్రద్ధ తీసుకోవడం లేదనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. 2022, 2023 ఖరీఫ్ సీజన్‌లలో రైతుల్ని నాణ్యమైన పత్తి విత్తనాల పేరుతో దళారులు, వ్యాపారులు కొంత మంది అధికారుల అండదండలతో నాసిరకం, కల్తీ విత్తనాలను రైతులకు అంటగట్టారు. 2022 సంవత్సరంలో జాదూరకం కంపెనీకి చెందిన నాసిరకం విత్తనాలను పొలాల్లో విత్తడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ రైతులకు దాదాపు రూ.20 కోట్లు చెల్లించాలని జిల్లా వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇంత వరకు ఆ రైతులకు నష్టపరిహారం అందించలేదు.

సాయం అరకొరే

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు ఏడున్నర లక్షల మంది రైతులు వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. 6.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు. ఈ రైతులకు ఖరీఫ్ సీజన్‌లో గత సంవత్సరం 8వేల కోట్ల పంట రుణాలను అందించారు. ఈ సంవత్సరం ఎన్నికల కారణం చూపి రుణ ప్రణాళికను ఇంకా ఖరారు చేయలేదని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఈ సంవత్సరమైనా తమకు వ్యవసాయ పనులు చేసుకోవడానికి పూర్తి సబ్సిడీతో యంత్ర పరికరాలు అందించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పెట్టుబడి సాయం ఏ మూలకు సరిపోవడం లేదని, కనీసం రూ.30వేల దాకా ఇవ్వాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.



రైతులకు సరిపడా ఎరువులు ఎక్కడ..?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు కోసం రైతులు దాదాపు 5లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగిస్తారు. ప్రధానంగా డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులతో పాటు పొటాష్ తదితర ఎరువులను రైతులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఏటా రైతులు రైతుభరోసా కేంద్రాల ద్వారా తమకు అవసరమైన ఎరువులను తీసుకునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసినా 90 శాతం ఆర్‌బీకేల ద్వారా అవసరమైన ఎరువులు రైతులకు అందించే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఎరువులను, ఆర్‌బీకేల ద్వారా రైతులకు చేరవేస్తున్నట్లు కాగితాల్లో మాత్రమే చెబుతోంది. రైతులంతా ప్రైవేటు డీలర్లనే అధిక ధర చెల్లించి డీఏపీ, యూరియా తదితర ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో బస్తాపై రైతులు రూ.50 నుంచి రూ.100 వరకు అదనంగా చెల్లించి కొంటున్నారు. ఇదే అదునుగా కొంత మంది దళారులు వ్యాపారులు నాసిరకం ఎరువులను రైతులకు అంటగడుతున్నారు.




ఉమ్మడి జిల్లాలో రాబోయే ఖరీఫ్‌లో సాగు చేయనున్న పంటల విస్తీర్ణం వ్యవసాయ శాఖ అంచనా (హెక్టార్లలో)

పంట పేరు	విస్తీర్ణం
పత్తి	2.30 లక్షల హెక్టార్లు
వరి	79,018
జొన్న	14,062
మొక్కజొన్న	30,154
కొర్ర	13,613
కంది	48,228
వేరుశనగ	1,42,000
ఆముదం	54,406
మిరప	15,567
ఉల్లి	30,746
టమోట	3వేలు
ఇతర పంటలు	45వేలు
మొత్తం	**6.20 లక్షల హెక్టార్లు**

ప్రభుత్వం సాయం చేయాలి

ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరో వైపు అధికారుల నిర్లక్ష్యం కారణంగా వ్యవసాయం మాకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదు. ఒకప్పుడు పండుగలా కొనసాగిన సాగు ప్రస్తుతం ఆందోళన కలిగించేలా తయారైంది. ప్రభుత్వం మరింత సాయం చేస్తే తప్ప మేము కోలుకోం.

- రైతు భాస్కర్ రెడ్డి, నక్కలవాగు పల్లె



రైతులకు అండగా ఉంటాం



రాబోయే ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు సాగు చేసుకునేందుకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. కల్తీ, నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాము. అదే విధంగా రైతులకు దాదాపు 15వేల క్వింటాళ్ల వేరుశనగ, కంది, తదితర విత్తనాలను 40 శాతం సబ్సిడీపై అందించేందుకు చర్యలు చేపట్టాము. ఇందులో భాగంగా శుక్రవారం నుంచే ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో రాయితీ విత్తనాల కోసం తమ పేర్లను పొలాల వివరాలను నమోదు చేయించాలని కోరుతున్నాము. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం అండగా ఉంటుంది. త్వరలోనే రుణ ప్రణాళికను ఖరారు చేసి రైతులకు సకాలంలో పంట రుణాలను అందిస్తాం.

- వరలక్ష్మి, జేడీ

వ్యవసాయాన్ని జూదంగా మార్చేశారు



రైతులు పంటలను సాగు చేసుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో ప్రభుత్వం ఏ మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదు. మరోవైపు దళారులు, వ్యాపారులు అధికారులు రాజకీయ నాయకుల అండదండలతో రైతులను నిండా ముంచుతున్నారు. నాసిరకం విత్తనాలను, ఎరువులను రైతులకు అంటగట్టుతున్నారు. చివరికి పంట నష్టానికి గురైన రైతులకు న్యాయంగా అందించాల్సిన పరిహారాన్ని అందించడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది.

- జగన్నాథం, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి

నమ్మించి ముంచాడు..!

- నకిలీ బంగారు నగలతో బ్యాంకు రుణాలు
- రైతుల ఖాతాల పేరు మీద మంజూరు
- వడ్డీ కట్టాలని ఫోన్లు చేయడంతో వెలుగులోకి..
- మోసగాడి ఫోన్ స్విచ్ఛాఫ్.. గగ్గోలు పెడుతున్న బాధితులు



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు

మద్దికెర, మే 19: బ్యాంకులో కాంట్రాక్టు బేసిక్ పని చేసే ఓ వ్యక్తి ఖాతాదారులను బురిడీ కొట్టించాడు. నకిలీ బంగారుతో రూ.14 లక్షల మేర మోసానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పెరవలి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని పెరవలి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పత్తికొండకు చెందిన ఓ వ్యక్తి కాంట్రాక్టు బేసిక్ కింద పని చేస్తున్నాడు. బ్యాంకులో బంగారు తూకం వేసి రుణాలు ఇప్పించడం ఇతని పని. దీంతో ఖాతాదారులకు ఇతను బాగా పరిచయస్తుడిగా మారాడు. ఈ క్రమంలోనే ఆయా గ్రామాల రైతులకు మాయ మాటలు చెప్పి నమ్మించాడు. తన వద్ద ఉన్న బంగారు నగలను బ్యాంకులో తనఖా పెట్టి మీ బ్యాంకు పాసుపుస్తకంపై రుణం తీసుకుంటానని చెప్పాడు. దీంతో తెలిసిన వ్యక్తే కదా అని రైతులు అందుకు ఒప్పుకున్నారు. దీంతో సదరు వ్యక్తి నకిలీ బంగారు నగలను బ్యాంకులో పెట్టి రైతుల ఖాతాల పేరు మీద రుణం మంజూరయ్యేలా చేశాడు. ఆ తరువాత రైతులు వారి ఖాతాల్లో జమ అయిన డబ్బును తీసి ఇచ్చారు. అలా 14 మంది రైతుల నుంచి నకిలీ బంగారు పెట్టి దాదాపు రూ.20 లక్షల మేర రుణం తీసుకున్నాడు. ఈ తతంగమంతా దాదాపు 8 నెలలకు పైగా జరిగింది. అయితే వడ్డీ చెల్లించాలంటూ బ్యాంకు వారు ఖాతాదారులకు ఫోన్ చేయగా ఈ వ్యవహారమంతా బయట పడింది. దీంతో బ్యాంకులో పని చేస్తున్న సదరు వ్యక్తి వారం రోజుల నుంచి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకొని ఉడాయించాడు. బ్యాంక్ వాళ్లేమో రుణాలు జమ అయిన ఖాతాదారులే వడ్డీ చెల్లించాలని చెబుతున్నారు. దీంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. తెలిసిన వ్యక్తి కదా అని ఒప్పుకుంటే ఇలా ముంచుతాడని అనుకోలేదని వాపోతున్నారు. అయితే బాధితులు ఉడాయించిన వ్యక్తి కుటుంబ సభ్యులను కలవగా ఆ డబ్బును తాము చెల్లిస్తామని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ హరీష్‌ను వివరణ కోరగా.. బ్యాంకులో మోసం జరిగిన మాట వాస్తవమేనని, విచారణ చేస్తున్నామని, ఇప్పటి వరకు రూ.14 లక్షలు మోసం చేసినట్లు గుర్తించామని వివరణ ఇచ్చారు.

పత్తి విత్తనాల ధర పెంపు

- గత సంవత్సరంతో పోలిస్తే ప్యాకెట్‌పై రూ.13 పెరిగిన ధర
- ఉమ్మడి జిల్లా రైతులపై భారం

కర్నూలు(అగ్రికల్చర్), మే 19: రాష్ట్రంలోనే అత్యధికంగా పత్తి పంటను గత దశాబ్ద కాలంగా సాగు చేస్తున్న రైతులపై మరోసారి మోయలేని భారం పడింది. ప్రకృతి వైపరీత్యాలు, పాలకుల నిర్లక్ష్యంతో పత్తి రైతు గత కొన్ని సంవత్సరాలుగా నష్టాల ఊబిలోకి కూరుకుపోతున్నారు. ప్రస్తుతం ఈ నష్టాలకు తోడు పత్తి విత్తనాల ధరను పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో ఒక ప్యాకెట్ విత్తనాలపై రూ.13 దాకా అదనంగా రైతులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో దాదాపు రెండున్నర లక్షల హెక్టార్లలో రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు 3 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమవుతాయి. ఈ లెక్కన ఉమ్మడి కర్నూలు జిల్లాకు దాదాపు 20 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. గత సంవత్సరం ప్యాకెట్ పత్తి విత్తనాల ధర రూ.853 ఉండగా.. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రూ.864కు పత్తి విత్తనాల కంపెనీల యజమాన్యాలు పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీంతో పత్తి రైతులు అదనంగా రూ.కోట్ల భారాన్ని భరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే కల్తీ విత్తనాల కారణంగా రైతులు భారీగా నష్టపోతున్నారు. నకిలీ పత్తి విత్తనాలను అరికట్టాల్సిన వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. దీంతో నకిలీ నాసిరకం పత్తి విత్తనాలను వ్యాపారులు, దళారులు భారీగా రైతులకు అంటగడుతూ జేబులు నింపుకుంటున్నారు.

బ్లాకులో విక్రయాలు

గుర్తింపు పొందిన పత్తి విత్తనాల కొరత ఉమ్మడి జిల్లాలో తీవ్రంగా ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ముందస్తుగా పొలాల్లో రైతులు విత్తనాలు వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. వర్షాలు మొదలు కావడంతో వ్యాపారులు ప్రముఖ కంపెనీల పత్తి విత్తనాల ధరను భారీగా పెంచుతున్నారు. ప్రస్తుతం ఒక ప్యాకెట్ పత్తి విత్తనాల ధర రూ.864 కాగా, బ్లాక్ మార్కెట్లో రూ.900 నుంచి రూ.1000 వరకు అధిక ధరను నిర్ణయించి డీలర్లు రైతులకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఎమ్మిగనూరు, పత్తికొండ, కర్నూలు, ఆలూరు, డోన్, పాణ్యం తదితర నియోజకవర్గాల్లో గుర్తింపు పొందిన పత్తి విత్తనాలను కొనుగోలు చేసేందుకు ఎమ్మార్పీ ధర కంటే రూ.200 పైగానే చెల్లించేందుకు రైతులు సిద్ధం కావడం విశేషం. ఎకరాకు రెండు ప్యాకెట్ల విత్తనాలు అవసరం కాగా, మూడు ప్యాకెట్ల వరకు రైతులు కొంటున్నారు. డీలర్లు అధిక ధరలు వసూలు చేయకుండా ప్రభుత్వం కంట్రోల్ చేయాలని రైతులు కోరుతున్నారు.



పత్తి విత్తనాల నిల్వలు

2019 నుంచి 2024 వరకు పత్తి విత్తనాల ప్యాకెట్ ధరల వివరాలు

సంవత్సరం	ధర (రూ.లలో)
2019	రూ.710
2020	రూ.730
2021	రూ.767
2022	రూ.810
2023	రూ.853
2024	రూ.864

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో

మృతదేహాల కలకలం

- గార్గేయపురం చెరువులో లభ్యమైన ముగ్గురు మహిళల మృతదేహాలు
- ఘటనా ప్రాంతాన్ని పరిశీలించిన డీఐజీ, ఎస్పీ



ఘటనా స్థలాన్ని పరిశీస్తున్న పోలీసులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 19: కర్నూలు మండలం నందికొట్కూరు రహదారిలోని గార్గేయపురం చెరువులో ఆదివారం మూడు మృతదేహాలు బయటపడ్డాయి. దీంతో గార్గేయపురం గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. స్థానికులు కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలుకా సీఐ శ్రీధర్, ఎస్ఐ పీరయ్యలు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇద్దరు మహిళల మృతదేహాలు బోర్లబొక్కలా ఉండి నీటిలో తేలియాడుతూ కనిపించాయి. స్థానికుల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాల శరీరంపై లంగా, రవికలు మాత్రమే ఉన్నాయి. ఒక మహిళ మెడలో పూసల హారం ఉంది. ఓ మహిళ చేతికి పచ్చ బొట్టు ఉంది. మొదట హిజ్రాలుగా అనుమానించిన పోలీసులు సమీపంలోని హిజ్రాలను పిలిపించి మృతదేహాలను పరిశీలించారు. చివరకు వారు హిజ్రాలు కాదని నిర్ధారించారు. ఒక మృతురాలి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు, మరో ఇద్దరి మహిళల వయస్సు ఇంచుమించు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని భావించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఒక్కసారిగా ముగ్గురు మహిళల మృతదేహాలు లభ్యం కావడంతో పోలీసులు ఖంగుతిన్నారు. స్థానికులు ఆందోళనకు గురయ్యారు.



ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఐజీ, ఎస్పీలు

ముగ్గురు మహిళల మృతదేహాలు లభ్యం కావడంతో పోలీసు శాఖలో కలవరం నెల కొంది. కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు, ఎస్పీ జి.కృష్ణకాంత్ పోలీసు బృందాలతో అక్కడకు వెళ్లారు. మృతదేహాలు లభ్యమైన ప్రాంతాలను పరిశీలించారు. ఆ మృత దేహా లు ఎవరివనే కోణంలో విచారించాలని పోలీసు కింది స్థాయి అధికారులను ఆదేశించారు. చెరువు, పక్కనే ఉన్న సిటీ ఫారెస్టు ప్రాంతాలను గాలించారు. మరెక్కడా ఇతర అనుమానాస్పద ఆధారాలు లభ్యం కాలేదు. అన్ని కోణాల్లో విచారించాలని ఆదేశించారు.

ఇద్దరు మహిళలు మహబూబ్‌నగర్ జిల్లా వాసులు

మృతి చెందిన ముగ్గురు మహిళల్లో ఓ ఇద్దరు మహబూబ్‌నగర్ జిల్లా వాసులుగా పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలం పరిశీలించిన అనంతరం డీఐజీ, ఎస్పీలు ఈ కేసు దర్యాప్తు కోసం మూడు టీమ్‌లను నియమించారు.



మూడు టీమ్‌లు నగరంలో ఉన్న బ్రోతల్ హౌస్ నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నాయి. దీంతో మృతి చెందిన ఇద్దరు మహిళలను మమత అనే బ్రోతల్ నిర్వాహకురాలు గుర్తుపట్టింది. పూర్తి వివరాలను పోలీసులు సోమవారం వెల్లడించే అవకాశం ఉంది.

ఉల్లి ఆశ...

- ఖరీఫ్ ప్రారంభంలోనే సాగుచేస్తున్న రైతన్న
- బావులు, బోర్లకింద ఐదువందల ఎకరాల్లో
- చేతికందే సమయానికి ధర వస్తుందనే ఆశ

బోర్ల దగ్గర సాగు చేసిన ఉల్లి



గోనెగండ్ల మే 19: ఉల్లి పంటపై రైతులు చాలా ఆశ పెట్టుకున్నారు. ఉల్లి ఒకసారి దగా చేసినా మరోసారి ఆదుకుంటుందని రైతుల నమ్మకం. ఒక్కసారి ఉల్లి ధర పలికితే చాట. గత ఏడాది నష్టం కూడా తీరి లాభాలు వస్తాయని ఎప్పటిలాగే ఈసారి కూడా సాగు చేశారు. గత రబీ సీజన్‌లో ఉల్లి పంటను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. క్వింటం ధర రూ. 800 నుంచి రూ. 500 మాత్రమే పలికింది. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అయినప్పటికి ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో చాల మంది రైతులు బావులు, బోర్ల కింద ఉల్లి పంటను సాగుచేస్తున్నారు. వర్షం రెండుసార్లు కురియడంతో భూమి చల్లబడి రైతులు ఉల్లి పంటను సాగు చేస్తున్నారు. ఈసారి ఉల్లి పంట చేతికి అందే సమయానికల్లా ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, మండలాల పరిధిలో ఇప్పటికే బావులు, బోర్ల కింద దాదాపు ఐదు వందల ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. కొంద మంది రైతులు ఉల్లినారును సైతం అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.

గత ఏడాది నష్టల బాటలో

గత రబీ సీజన్‌లో ఉల్లి పంట సాగుచేసిన రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. పెట్టుబడులు రాక చివరికి రవాణా ఖర్చులు సైతం అందక



గోనెగండ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉల్లి నారు

అప్పులపాలయ్యారు. క్వింటం రూ 800 నుంచి రూ. 500 పలకడంతో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో దాదాపు రూ. 5 కోట్ల మేర పంట నష్టం వాటిల్లిన ట్లు సమాచారం. గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మండలాల్లో చాల మంది రైతులు ఉల్లి పంటను పొలంలోనే మూగజీవాలకు వదిలేశారు. ట్రాక్టర్‌తో దున్నేశారు.

ఒక ఎకరంలో ఉల్లి సాగు చేశాను



పోయిన ఏడాది 2 ఎకరాల్లో ఉల్లి పంటను సాగుచేసి దాద్పాపు రూ. 1.50 లక్షలు నష్టపోయాను. కనీసం పెట్టుబడులు కూడా అందలేదు. ఈసారైనా గిట్టుబాటు ధర లభిస్తుందని నమ్మకంతో ఒక ఎకరంలో ఉల్లి పంటను సాగు చేశాను. -ఉరుకుంద రెడ్డి, వేముగోడు రైతు

గిట్టుబాటు లభిస్తుందన్న ధీమా

జిల్లాలో ఎమ్మిగనూరు. మంత్రాలయం, ఆదోని ప్రాంతాలలో ఉల్లి పంట అధికంగా సాగు చేస్తారు. పంట చేతికి అందే సమయానికి ఉల్లి నిల్వలు చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండవని, ఆ సమయంలో ఇతర రాష్ట్రాల నుండి కూడా ఉల్లి నిల్వలు రావడానికి ఆలస్యం అవుతుంది కాబట్టి ముందుగా మార్కెట్‌లోకి చేరే పంటకు డిమాండ్ ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.

పొలంలోనే ఊపిరి వదిలిన రైతు



రామచంద్ర (ఫైల్)

పత్తికొండ టౌన్, మే 19: ఓ రైతు తన పొలంలోనే గుండె ఆగి మృతి చెందిన సంఘటన ఆదివారం పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ఇలా ఉన్నాయి. చిన్నహుల్తి గ్రామానికి చెందిన కప్పట్రాళ్ల రామచంద్ర (52) అను రైతు తనకున్న మూడెకరాల సొంత పొలంతో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేసుకున్నాడు. అయితే.. ఏటా వ్యవసాయం చేసినా అప్పులు అంతకంతకూ పెరుగుతూ వచ్చాయి. అయితే.. పెట్టిన పెట్టుబడులు చేతికందక పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక రామచంద్ర అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ మనోవేదన చెందుతున్న రామచంద్ర ఉదయాన్నే గ్రామానికి సమీపంలో ఉన్న పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. అక్కడే రైతు గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను పత్తికొండ ఆసుపత్రికి తీసుకురాగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రైతుకు భార్య చిట్టెమ్మతోపాటు ముగ్గురు సంతానం. ఇంటి పెద్ద దిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరును పలువురిని కంటతడి పెట్టించింది.

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు

కలెక్టర్ డాక్టర్ సృజన



గుడికంబాలి రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

కౌతాళం, మే 19: అనుమతులు లేనిదే ఇసుకను నదుల నుంచి తరలిస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని కలెక్టర్ డాక్టర్ సృజన తెలిపారు. మండల పరిధిలోని గుడికంబాలి, మరళి ఇసుక రీచ్‌లను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సృజన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నదులలో ఎట్టి పరిస్థితుల్లో యంత్రాలతోగాని, వేరే ఇతర సామగ్రితోగాని నది నుంచి ఇసుకను తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మరళి ఇసుక రీచ్ కర్ణాటక సరిహద్దులో ఇసుకను తోడుతున్న యంత్రాన్ని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ స్వామి గుర్తించి సీజ్ చేయాలని పోలీసులను ఆదేశించి అక్కడ నుంచి వెళ్లిపోయారు. కౌతాళం పోలీసులు, రెవెన్యూ అధికారులు యంత్రం వద్దకు పోగా యంత్రం ఉన్న ప్రాంతం కర్ణాటక కావడంతో ఆ రాష్ట్ర అధికారులకు సమాచారం అందించి ఇక నుంచి తమ సరిహద్దుల్లోకి వస్తే కేసులు నమోదు చేస్తామని కోసిగి సీఐ ప్రసాద్ తెలిపారు. వీరి వెంట కౌతాళం తహసీల్దార్ అలెగ్జాండర్, ఆర్ఐ రాజశేఖరగౌడ్, ఇరిగేషన్ అధికారులు, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి ఉన్నారు.

నేడు ఇంటర్ పరీక్షల ఫీజుకు ఆఖరు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 19: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపునకు సోమవారం చివరి గడువు అని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఆదివారం తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా తాత్కాలిక ఫీజు రూ.3వేలు చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఎయిడ్స్ బాధను నయం చేద్దాం

క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన ఎయిడ్స్ నివారణ సంస్థ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య అధికారులు

కర్నూలు(హస్పిటల్), మే 18: అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినం సందర్భంగా ఆదివారం రాత్రి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా క్షయ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా క్షయ నియంత్రణ కేంద్రం వద్ద ఈ ర్యాలీని డిస్ట్రిక్ట్ టీబీ ఆఫీసర్ డా.ఎల్.భాస్కర్ ప్రారంభించారు. అనంతరం ర్యాలీ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి పరిపాలన విభాగం వరకు కొనసాగింది. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12,030 మంది క్రమం తప్పకుండా 4 ఏఆర్‌టీ కేంద్రాలు, 9 లింక్ ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా బాధితులు ఉచితంగా మందులు వాడుతున్నారన్నారు. అలాగే గత ఏడాది హెచ్ఐవీ, ఇతర వ్యాధులతో 56 మంది చనిపోయారనీ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఈ ర్యాలీ ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ఆదోని, నంద్యాల ఏఆర్‌టీలకు సీడీ4 పరీక్ష చేసే అధునాతన యంత్రం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంజూరు చేసిందని త్వరలో వీటిని బాధితులకు అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం మేనేజర్ ఆలిహైదర్, దేవి శంకర్‌గౌడు, క్షయ నివారణ వైద్యాధికారి మల్లికార్జున రెడ్డి, ఏఆర్‌టీ వైద్యాధికారి రాధిక, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు సుధారాణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రెండు విడతలుగా కౌంటింగ్‌కు శిక్షణ

కలెక్టర్ డా.జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 19: ఈ నెల 24, 31వ తేదీల్లో కౌంటింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు అన్ని రాష్ట్రాల ఆర్వోలకు కౌంటింగ్‌కు సంబంధించి డౌట్ క్లియరింగ్ సెషన్స్ నిర్వహించారు. ఈ నిర్వహణకు కలెక్టర్, ఆర్వోలు, ఏఆర్వోలు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ఆర్వోలు, ఏఆర్వోలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడుతూ డౌట్ క్లియరింగ్ సెషన్స్‌లో నిర్దేశించిన 17సీ, పీవో డైరీ, 17ఏ తదితర డాక్యుమెంట్లు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కంపెడీయం ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్, ఈసీఐ నుంచి ఈ నెల 20, 24వ తేదీల్లో వచ్చిన ఇన్‌స్ట్రక్షన్స్, ఆర్వో హ్యాండ్ బుక్, అబ్జర్వర్ హ్యాండ్ బుక్‌లో ఉండే కౌంటింగ్‌కు సంబంధించిన సూచనలను ఆర్వోలు, ఏఆర్వోలు క్షుణ్ణంగా చదవాలన్నారు. ఆర్వో స్థాయిలో కూడా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు టేబులేషన్ విధులు నిర్వహించే సిబ్బందితో డౌట్ క్లియరింగ్ సెషన్స్ నిర్వహించుకోవాలన్నారు. 22న పొలిటికల్ పార్టీలతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని ఆర్వో, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ, ఇతర నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్వోలు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కెమెరా ట్రాప్‌లో పెద్దపులి



నల్లమలలో పిల్లలతో ఆడ పెద్దపులి

రుద్రవరం, మే 19: నల్లమల అడవిలో ఇటీవల ఆడ పెద్దపులి తన పిల్లలతో కెమెరా ట్రాప్‌లో కనిపించింది. మూడు పిల్లలతో కలిసి సాసర్‌ఫీట్ వద్ద కెమెరాకు చిక్కింది. రెండు పెద్ద పులి పిల్లలు ముందు భాగం కాళ్ల వద్ద, మరో పెద్దపులి పిల్ల వెనుక భాగంలో తన తల్లి వద్ద ఉన్నాయి. సాసర్‌ఫీట్‌లో నీరు తాగడానికి వచ్చి ఉంటుందని అటవీ అధికారులు భావిస్తున్నారు. సాసర్‌ఫీట్‌లో నీటి దాహాన్ని తీర్చుకుని పిల్లలు, తల్లి సరదాగా, ఉల్లాసంగా కనిపించాయి.

తీగ లాగితే డొంక కదిలింది

- మొదటి రోజు 62 మందిని విచారిస్తే రూ.3,48,215 అవినీతి బట్టబయలు

రుద్రవరం, మే 19: రుద్రవరం మండలం శ్రీరంగాపురం గ్రామంలో బ్రాంచ్ పోస్టాఫీసులో తీగ లాగితే డొంక కదిలినట్లయింది. శనివారం నంద్యాలకు చెందిన అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ సత్యనారాయణ విచారణ చేపట్టారు. మొత్తం 62 మందిని విచారిస్తే రూ.3,48,215 అవినీతి బయటపడినట్లు తేలింది. ఈ మొత్తం బ్రాంచ్ పోస్టుమాస్టర్ స్వాహా చేసినట్లు విచారణలో బట్టబయలైంది. ఇంకా విచారించాల్సిన లబ్ధిదారులు చాల మంది ఉన్నారు. బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలో శ్రీరంగాపురం, దక్షిణకొట్టాలు, తుమ్మలకొట్టాల గ్రామాలు ఉన్నాయి. అందరినీ విచారిస్తే అవినీతికి పాల్పడిన సొమ్ము లక్షల్లోనే ఉంటుందని స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నిరుపేదలు కాయ కష్టం చేసి తమ పిల్లల కోసం డబ్బు పొదుపు చేస్తే ఇలా వాడుకోవడంతో పోస్టల్ ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదిఏమైనా విచారణలో మరింత అవినీతి బయటపడే అవకాశం ఉందని స్థానికంగా చర్చ.

అపరిచితులను రానివ్వొద్దు

ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు



సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, ఎస్పీ

పాణ్యం, మే 19: మండలంలోని ఆర్జీఎం, శాంతిరాం, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల సమీపంలోకి ఎవర్నీ రానివ్వవద్దని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం ఆయన స్ట్రాంగ్ రూమ్‌లకు వేసిన సీళ్లు, తాళాలు, తలుపులను, వెబ్‌కాస్ట్ అవుతున్న దృశ్యాలను కమాండ్ కంట్రోల్ ద్వారా తనిఖీ చేశారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూమ్‌లు ఉన్న ప్రాంతాల్లోకి ప్రవేశించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన కమాండ్ కంట్రోల్ వద్దగల సీసీ టీవీ కెమెరాలు పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు దిశానిర్దేశం చేస్తూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కౌంటిగ్ ప్రక్రియ ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఉంటుందని తెలిపారు. జిల్లాలో హింసాత్మక సంఘటనలకు పాల్పడినా, రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమలుతో ఎక్కడా నలుగురికి మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. స్ట్రాంగ్‌రూం వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల భద్రతా చర్యల్లో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో పహారా ఉండాలని ఆదేశించారు. డీఎస్పీ స్థాయి అధికారి 24 గంటలపాటు భద్రతను పర్యవేక్షిస్తుంటారని చెప్పారు. విద్యుత్ అంతరాయం లేకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు నిరంతరం పని చేసేలా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్ఐ అశోక్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కర్షకులను ఉత్తేజపరిచేందుకే రైతు సంబరాలు

కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ప్రభాకర్ రెడ్డి

ఓర్వకల్లు, మే 19: రైతులను ఉత్తేజపరిచేందుకే ప్రతి ఏటా రైతు సంబరాలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మీదివేముల గ్రామంలో పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి 16 జతల ఎద్దులు పోటీలు పాల్గొన్నాయి. పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీల్లో మొదటి విజేతగా కడప జిల్లా దాసరిపల్లె గ్రామానికి చెందిన చిన్నవీరన్న నాయుడు ఎద్దులు 6168 అడుగుల దూరం లాగి రూ.50వేల నగదును కైవసం చేసుకున్నాయి. రెండో స్థానంలో అనంతపురం జిల్లా పుల్లేరుపల్లె గ్రామానికి చెందిన పుచ్చల భాస్కర్ రెడ్డి 6163 అడుగుల దూరం లాగి రూ.40వేల నగదును, మూడో స్థానంలో కడప జిల్లా సి. కొత్తపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల సుబ్బారెడ్డి ఎద్దులు 6,075 అడుగుల దూరం లాగి రూ.30వేల నగదును, నాలుగో స్థానంలో అనంతపురం జిల్లా హోసూరు మండలం పల్నాడు చెందిన గోపిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దులు 6వేల అడుగుల దూరం లాగి రూ.20వేల నగదును, 5వ స్థానంలో సూర్యపేట జిల్లా రామలక్ష్మీపురం మండలం, కోదాడ గ్రామానికి చెందిన రైతు కేఎస్ రెడ్డి ఎద్దులు 5,909 అడుగుల దూరం లాగి రూ.15వేల నగదును, 6వ స్థానంలో పీఆర్‌పల్లి తాండ్రపాడు గ్రామానికి చెందిన చిన్నరత్నం, రంగనాయకుడు ఎద్దులు 5,895 అడుగుల దూరం లాగి రూ.10వేల నగదును సొంతం చేసుకున్నాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతగా వాడాల రామనాయుడు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పద్మనాభ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సంజీవరెడ్డి, ఎర్రన్న యాదవ్, రమేష్ నాయుడు, క్రిష్ణయ్య యాదవ్ పాల్గొన్నారు.

వర్షం రాకతో...

- విత్తన దుకాణాలు కళకళ
- భారీగా విత్తనాలను కొనుగోలు చేస్తున్న రైతులు



విత్తన దుకాణాల దగ్గర రైతుల సందడి

ఎమ్మిగనూరు, మే 19: తొలకరి పలుకరించడంతో రైతన్న సేద్యానికి సిద్ధమవుతున్నాడు. భూములను దుక్కులు దున్నుతూ సాగుకు సిద్ధం చేసుకుంటూ మరోవైపు సాగుచేసే పంటలకు సంబంధించిన విత్తనాలను కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. దీంతో ఎమ్మిగనూరు పట్టణంలోని పలు విత్తన దుకాణాలు రైతన్నలతో కళకలలాడుతున్నాయి. ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలతోని నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, మంత్రాలయం మండలాల్లో దాదాపు 2లక్షల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా పత్తిని సాగుచేసే అవకాశం ఉంది. అలాగే మిరప, వేరుశనగ, మొక్కజొన్న, వరితో పాటు ఇతర పంటలను ఓమోస్తరు సాగుచేయనున్నారు. ఇందుకుగాను రైతులు వర్షం కురిసి భూములు పదును కావడంతో విత్తనాల కొనుగోలుపై దృష్టి సారించారు. దీంతో ఎమ్మిగనూరు చుట్టుముట్టు గ్రామాల నుంచేగాక గోనెగండ్ల, ఆస్పరి, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు మండలాల నుంచి రైతులు భారీగా ఎమ్మిగనూరు పట్టణంలో ఉన్న విత్తన దుకాణాల్లో పత్తి, మిరప విత్తనాలతో పాటు ఇతర చిరుదాన్యాల విత్తనాల కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తికి సంబంధించి యూఎస్7067, 4708, 4753, రేవంత్, జేకె సీడ్స్, న్యూజివీడు, మైకో, రాయల్, క్రిస్టల్, అమర్ బయోటెక్, వేదా, కృషిదన్, సూపర్‌సీడ్స్ వంటి కంపెనీలకు చెందిన విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ప్రధానంగా రైతులు పత్తి సాగుచేసే అవకాశం ఉండడంతో ఇప్పటికే మార్కెట్‌లో దాదాపు 1.50లక్షల ప్యాకెట్లకుపైగా వివిధ రకాల కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

-మహేశ్వరరెడ్డి, ఏవో

శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, మే 19. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. ఆదివారం ఏకాదశి సందర్భంగా బృందావనంకు నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తప్త ముద్రధారణ చేశారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసంను పాటించారు.

భక్తుల రద్దీ : రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీమఠం కిక్కిర్సింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలనుంచి వే లాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నదితీరం, మధ్వమార్గ్ కారిడార్ భక్తులతో కోలాహలంగా మారింది.



మంత్రాలయం శ్రీ మఠంలో రద్దీగా ఉన్న భక్తులు

మిద్దెపై నుండి పడి వ్యక్తి మృతి

భార్య, బంధువులపై తండ్రి ఫిర్యాదు

ఆలూరు, మే 19: ఆలూరు మండలం అరికెర గ్రామంలో ఆదివారం పాండురంగ (40) మిద్దె మీది నుంచి పడి మృతి చెందాడు. మృతుడికి భార్య తిరుమలమ్మ, ఏడేళ్ల కుమారుడు ఉన్నారు. అయితే తన కుమారుడు మృతికి భార్య, ఆమె బంధువులు కారణం అంటూ మృతుడి తండ్రి గోవింద్ ఆలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి విచారణ చేపట్టనున్నారు.

రాఘవేంద్ర స్వామి మఠానికి 1.5 కేజీల వెండి పాదుకల విరాళం

మంత్రాలయం, మే 19: రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరులోని రామ్‌నగర్‌కు చెందిన కుషలత అనే భక్తుడు ఒకటిన్నర కేజీ విలువ చేసే వెండితో తయారు చేయించిన పాదుకలను విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి తెలిపారు. ఆదివారం ఏకాదశిని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు వెండి పాదుకలను అందజేశారు. ఈ వెండి పాదుకలు రాఘవేంద్రస్వామి మూల బృందావనం ముందు ఉంచి పూజలు చేయాలని దాత కోరారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి ఆశిస్సులు అందజేశారు. కార్యక్రమంలో క్యాషియర్ దేశాయ్ నరసింహ స్వామి, అనంతపురాణిక్, వ్యాసరాజాచార్, జయతీర్థాచార్ పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో ముందుకు రావాలి


డా.బి. శంకర్‌శర్మ



పేద మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న డా.శంకర్‌శర్మ

కర్నూలు(హాస్పిటల్), మే 18: సమాజంలో పేదలను ఆదుకునేందుకు సామాజిక స్పృహతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని శ్రీ గురుదత్త పాలిక్లీనిక్‌లో ఆయన పేద మహిళలకు ఆయన చీరలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సొంత లాభాన్ని కొంత మానుకుని పొరుగు వారికి సేవ చేయాలన్నారు.

గ్రూప్-2 పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న
రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 19: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కర్నూలు నగర శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-1, 2 పరీక్షలకు సంసిద్ధమవుతున్నటువంటి విద్యార్థులకు ఏబీవీపీ తరఫున ఆర్‌ఎస్ అకాడమిలో ప్రిపేర్ అవుతున్నటువంటి విద్యార్థులకు గ్రూప్-2 పుస్తకాలను ఆదివారం పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య పాల్గొని మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఉన్నటవంటి వనరులు ఏమైనా ఉన్నాయంటే అది కేవలం యువశక్తి మాత్రమే.. అటువంటి యువకులను ఏబీవీపీ, ఆర్‌ఎస్ అకాడమి ద్వారా కలవడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆర్ ఎస్ అకాడమి కరస్పాండెంట్ రమేష్‌బాబు, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎర్రిస్వామి, రాష్ట్ర ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్ మహేష్, చరణ్, జితేంద్ర, ఆనంద్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి కురువ నరసింహులు తొలగింపు

కర్నూలు(అర్బన్), మే 19: కాంగ్రెస్ పార్టీ నుంచి కురువ నరసింహులును తొలగించామని డీసీసీ అధ్యక్షుడు కే బాబురావు తెలిపారు. మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడుబూరుకు చెందిన ఆయన క్రమశిక్షణా ఉల్లంఘించి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్నందున పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు తొలగించామని పేర్కొన్నారు. పార్టీకి ఇకపై సంబంధం లేదని ఈ విషయాన్ని కాంగ్రెస్ శ్రేణులు గుర్తించాలని కోరారు.

రాజకీయ ఆణిముత్యం నీలం సంజీవరెడ్డి



నీలం సంజీవరెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), మే 19: రాయలసీమ రాజకీయ ఆణిముత్యం నీలం సంజీవరెడ్డి అని డీసీసీ అధ్యక్షుడు కే బాబురావు అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ రాష్ట్ర పతి నీలం సంజీవరెడ్డి 111వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధకృష్ణ, ఉండవల్లి వెంకటన్న, అనంతరత్నం మాదిగ పాల్గొన్నారు.

వేసవి తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభం



తైక్వాండో క్రీడాకారులతో భూపతిరావు, క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు(స్పోర్ట్స్), మే 18: వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు క్రీడాకారులను కోరారు. ఆదివారం స్థానిక వీకర్‌సెక్షన్ కాలనీ సుందరయ్య పార్కు ఆవరణలో తైక్వాండో కోచ్ జి.షబ్బీర్‌హుశేన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో శిక్షనా శిబిరాన్ని భూపతిరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నగర పాలక కమిషనర్ సహాయ సహకారాలతో నగరంలోని 25 వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులు జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయిలో ఉషా పోటీల్లో రాణించాలన్నారు. వివరాలకు 6302555345ను సంప్రదించాలన్నారు. ఈ క్యాంపులో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పానుగంటి చంద్రయ్య, టి.నరసింహ పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుని ప్రభోత్సవం

● రేపు కల్యాణం, రథోత్సవం

కోడుమూరు (రూరల్), మే 19: మండలంలోని ముడుమలగుర్తిలో నవరత్నాల లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ప్రభోత్సవం వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం, కుంకుమార్చన వంటి పూజలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి పల్లకిలో కొలువుంచారు. ఆలయం నుంచి మేళతాళాల మధ్య తీసుకెళ్లి ప్రభపై స్వామిఅమ్మవార్లను ఆశీనులుగావించారు. అనంతరం భక్తులు ప్రభను ఉత్సాహంగా లాగారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చారు. కాగా మంగళవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, రథోత్స నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ పూజారి రంగన్నస్వామి, ప్రజలు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మహానంది క్షేత్రం

మహానంది, మే 19: మహానంది క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. చిన్నారులకు వేసవి సెలవులతో పాటు వీకెండ్‌ను పురష్కరించుకొని భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి శనివారం రాత్రే తరలి వచ్చారు. దేవస్థానం వసతి గదులు, ప్రయివేట్ వసతి గదులు, కల్యాణ మంటపాల్లో భక్తులు విశ్రాంతి తీసుకొన్నారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే కోనేరుల్లో పుణ్య స్నానాలు నిర్వహించుకొనేందుకు మహా ముఖద్వారం వద్దకు చేరుకొన్నారు. అనంతరం పరమశివుడు, కామేశ్వరీదేవి దర్శనం కోసం గంటల కొద్ది క్యూలో నిల్చొని దర్శించుకున్నారు.

చేదు మామిడి

● పూత రాలి తగ్గిపోయిన దిగుబడి
● తీవ్రంగా నష్టపోయిన రైతులు
● పెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితి
● ప్రభుత్వం ఆదుకోవాలంటున్న మామిడి రైతులు



ఓర్వకల్లు, మే 19: ఏటా మామిడి రైతులను కష్టాలు చుట్టుముడుతున్నాయి. మామిడి చెట్లకు పూత రాలిపోవడం, పురుగు సోకడం, ఎంతో కొంత దిగుబడి వస్తే.. గిట్టుబాటు ధర లభించకపోవడం వల్ల అప్పులపాలవుతున్నారు. ఈ ఏడాది వీటికి తోడు పూత తెగుళ్లతో కాయలు రాలిపోవడం కన్నా ఎండల తీవ్రతతో ఎక్కువగా రాలిపోయాయి. దీంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఓర్వకల్లు మండలంలోని పాలకొలను, ఉయ్యాలవాడ, చెన్నంచెట్టి పల్లె, కాల్వ, బ్రాహ్మణపల్లె, కాల్వబుగ్గ, నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలంలోని ఎంబాయి, రుద్రవరం, మండ్లవానిపల్లె తదితర గ్రామాల్లో దాదాపు 5వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. మొదట్లో పూత బాగుండటంతో కౌలు రైతులు, వ్యాపారులు తోటలను కౌలుకు తీసుకున్నారు. ఈ ఏడాది తమ కష్టాలు తీరుతాయని భావించారు. కానీ ఎండలతో మామిడి కాయలు నేలపాలయ్యాయి. దీంతో రైతులు, కౌలు రైతులు, వ్యాపారులు రూ.లక్షల్లో నష్టపోయారు. ఆరేళ్లుగా పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. రైతులకు ముందు గుత్తను చెల్లించామని, గత ఏడాది కూడా గాలి వానకు మామిడి కాయలు నేలపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుల్లో చాలా మంది రూ.3 వడ్డీతో అప్పులు చేసి కౌలు చెల్లించారు. పెట్టుబడిపై లక్షల్లో ఖర్చు పెట్టారు. దీంతో మామిడి పంటకు భారీ డిమాండ్ ఉంది. దిగుబడి తగ్గడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గతంలో వంద, 50 కాయలు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ధర ఉండేది. అయితే.. ఈ ఏడాది మామిడిపండ్లు దిగుబడి తగ్గడంతో కేజీ రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. సోమయాజులపల్లె జాతీయ రహదారిపై వ్యాపారులు, కౌలు రైతులు తీసుకువచ్చి వాహనదారులకు విక్రయించే వారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. దిగుబడి తగ్గిపోవడంతో వ్యాపారులు ధరలు పెంచేశారు. సామాన్యులు మామిడి పండ్లు కొనలేకపోతున్నారు. దీంతో పాటు సాధారణంగా ఫిబ్రవరి మాసంలోనే మామిడి చెట్లకు పూత వస్తుంది. మార్చి, ఏప్రిల్ నెలలో దిగుబడులు చేతికి వస్తాయి. అయితే.. ఈ ఏడాది వాతావరణంలో మార్పుల వల్ల సకాలంలో పూత రాలేదు. దీంతో రైతులు ఆందోళనలకు గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో పూత బాగా వచ్చిఆ ఎండల తీవ్రతకు రాలిపోయింది. ప్రభుత్వం స్పందించి రైతులను, కౌలురైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



జాతీయ రహదారిపై విక్రయించేందుకు పెట్టిన మామిడిపండ్లు

● ఎండల వల్లే తీవ్ర నష్టం



ఈ ఏడాది ఎండల వల్ల మామిడి దిగుబడి భారీగా తగ్గింది. గత ఏడాది ఈదురు గాలులతో పండ్లు నేలరాలాయి. మామిడి రైతాంగానికి ఏటా ఏదో ఒక కారణంతో తీరని నష్టం జరుగుతోంది. ఉద్యానవన శాఖ అధికారులు స్పందించడం లేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

\- గోవిందు, రైతు

● అప్పుల పాలయ్యాం



నాకు ఐదెకరాల మామిడి తోట ఉంది. కౌలు రైతులు, వ్యాపారులు గుత్తకు తీసుకునేందుకు ముందుకు రాలేదు. పెట్టుబడులు రూ.5 లక్షల మేర పెట్టా. అయితే.. ఈ ఏడాది పూత లేక కాస్తో.. కూస్తో మామిడికాయలు వచ్చాయి. దిగుబడి తగ్గిపోవడంతో ధర బాగానే ఉన్నా తీవ్రంగా నష్టపోయాం.

\- నాగేషులు, రైతు

పదెకరాలు గుత్తకు తీసుకున్నాం



పాలకొలనుకు వెళ్లే రామళ్లకోట రోడ్డులో పదెకరాలు మామిడి పంటను గుత్తకు తీసుకున్నాను. రూ.12 లక్షలు ముందు గుత్త చెల్లించాను. దిగుబడులు అంతంత మాత్రంగానే ఉండటంతో తీవ్రంగా నష్టపోయాను. గత ఏడాది కూడా గాలివానకు తీవ్రంగా నష్టపోయాను. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి.

\- మద్దిలేటి, కౌలు రైతు



ప్రజా సేవకే సుందరయ్య జీవితం అంకితం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(న్యూసిటీ), మే 19: ఉద్యమమే ఊపిరిగా ప్రజా సేవకు సుందరయ్య జీవితాన్ని అంకితం చేసి దేశానికే ఆదర్శమయ్యారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నగరంలో కొత్తబస్టాండు సుందరయ్య కూడలి, ఏపీ రజక వృత్తిదారుల సంఘం, వ్యవసాయ మార్కెటు యార్డు, శరీన్‌నగర్, క్రిష్ణానగర్, ఆర్టీసీ గేట్ ఆటో స్టాండ్ యూనియన్ అధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవకే అంకితమైన సుందరయ్య ఆడంబరాలు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ ఆరు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నాయకులు జేఎన్.శేషయ్య, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.గురుశేఖర్, సి.రాముడు పాల్గొన్నారు.

● పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగించడానికి ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. పాతబస్తీ సుజిత్ భవన్‌లో ఓల్డ్‌సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి. గౌస్‌దేశాయ్, నాయకులు విజయ్, షరీఫ్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

● సామాజిక పరివర్తకుడు సమసమాజ స్వాప్నికుడు సుందరయ్య జీవిత ఆదర్శమని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు అన్నారు. బుధవారపేట సమితి కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.భాస్కర్, డి.విజయ, మునిస్వామి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు: స్థానిక సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వక్తలు ఆయన చేసిన సేవల గూర్చి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గఫూర్‌మియా, వీరన్న, రాజు, లక్ష్మన్న, సుంకన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న అన్నారు. ఆదివారం మండలంలోని నన్నూరు గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా జరిగింది. సీపీఎం నాయకులు మధుసూదన్ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లేష్, మాసూంబాషా, సలాం, మహేష్, రాము, బొజ్జన్న, దస్తగిరి, మధు, తదితరులు పాల్గొన్నారు.



కర్నూలులో సుందరయ్య విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



కోడుమూరులో నివాళ్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు



నన్నూరులో పుచ్చలపల్లి సుందరయ్య
చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ హనుమంతయ్య

గూడూరు, మే 19: శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని గూడూరు ఎస్‌ఐ హనుమంతయ్య అన్నారు. ఆదివారం గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చనుగొండ్ల, వై ఖానాపురం గ్రామాల్లో ఎస్‌ఐ హనుమంతయ్య పోలీసు సిబ్బందితో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిందని, జూన్ నాల్గవ తేదిన కౌటింగ్ జరగనుందని ఈ నేపథ్యంలో ఎవ్వరూ ఘర్షణల జోలికి వెళ్లరాదని, ఎవ్వరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రతిభ ఉంటే అవకాశాలు పుష్కలం'



మహానంది లో సినీ
నటుడు సంజయ్ దంపతులు

మహానంది, మే 19: ప్రతిభ ఉంటే తెలుగు చిత్ర పరిశ్రమలో అవకాశాలు పుష్కలంగా వస్తాయని తెలుగు చలన చిత్ర నటుడు సంజయ్ తెలిపారు. మహానంది క్షేత్రానికి దైవదర్శనం కోసం నటుడు సంజయ్ కుటుంబ సమేతంగా వచ్చారు. సంజయ్ మాట్లాడుతూ తాను 2013లో కాలిచరణ్ చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం అయినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 50 చిత్రాల్లో వివిధ పాత్రలు పోషించినట్లు తెలిపారు. అయితే 2022లో వచ్చిన బలగం చిత్రంలో ప్రాధాన్యత గల పాత్ర పోషించడంతో తనను బలగం సంజయ్‌గా ప్రేక్షకులు పిలుస్తున్నారని అన్నారు. గతంలో పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన భీమ్లానాయక్, కాటమరాయుడు చిత్రాలతో పాటు బాలకృష్ణ, అఖండ, భగవత్‌కేసరి, జయసూర్య చిరంజీవి ఆచార్య సినిమాల్లో తాను నటించినట్లు చెప్పారు. ప్రస్తుతం నితిన్ హీరోగా నటిస్తున్న తమ్ముడు చిత్రంతో పాటు భగవంతుడు తో పాటు మరో 8 చిత్రాలు, వెబ్ సీరీస్‌లో నటిస్తున్నట్లు నటుడు సంజయ్ తెలిపారు. సినీ రంగంలో పోటీ ఎక్కువైందని అన్నారు. తనకు పరిశ్రమలో గాడ్‌ఫాదర్ అంటూ ఎవరూ లేరని పేర్కొన్నారు. భవిష్యత్తులో పూర్తి స్థాయిలో హీరోగా చేయాలని అనుకొంటున్నాని తెలిపారు.

రీటా నేర్చిన పాఠం పుస్తకావిష్కరణ

కర్నూలు(న్యూసిటీ), మే 19: కార్మిక రంగంలోని పోరాట అనుభవాలతో వచ్చిన రీటా నేర్చి పాఠం పుస్తకావిష్కరణ సభ కేకే భవన్‌లో జరిగింది. సీపీఎం నాయకురాలు బృందాకారత్ రాసిన ఈ పుస్తకాన్ని ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్. రాధాక్రిష్ణ, ఎండీ. అంజిబాబు మాట్లాడుతూ బృందాకారత్ తన అనుభవాలను పుస్తక రూపంలో తెలియజేశారన్నారు. కార్మిక నాయకులు పోరాటాలు, సమ్మెల్లో ఎలా కృషి చేయాలనే విషయాన్ని బిర్లా మిల్స్‌లో సమ్మె అనుభవాలు ఈ పుస్తకంలో ఉన్నాయని, అవి ప్రతి కార్మికుడికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కార్మికోద్యమంలో పని చేస్తే ప్రతి కార్యకర్త రీటా నేర్చిన పాఠం పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిబాబ, విజయ్, గోపాల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని మజరా గ్రామాలు



డ్రైనేజీ లేని కాలనీ

సి. బెళగల్, మే 19: మండలంలోని ఎర్రగుంటకొట్టాల, క్రిష్ణదొడ్డి, బ్యాదోళి పల్దొడ్డి మజరా గ్రామాలు అభివృద్ధికి నోచుకోదని ప్రజల వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలను జనాభా ప్రాతిపదికన గ్రామ పంచాయతీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే 300 లోపు జనాభాగల గ్రామాలను సమీప గ్రామ పంచాయతీలకు అనుసంధానం చేసి అభివృద్ధి చేసేందుకు ఏటా ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించే నిధుల్లో సగభాగాన మజరా గ్రామాల్లో కూడ ఖర్చుచేసి మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. అయితే ప్రభుత్వం కేటాయించిన అరకొర నిధుల్లో పాలకులు, అధికారులు పంచాయతీల్లోని ప్రధాన గ్రామాల్లోని ఖర్చు చేస్తుండటంతో మజరా గ్రామాల్లో అభివృద్ధి కొరవడింది. ఇందుకు నిదర్శనం మండలంలోని ఎర్రగుంటకొట్టాల గ్రామం చూడవచ్చు. గ్రామంలో జనాభా 278 ఉన్నారు. వారంతా వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. నేటికి గ్రామానికి రహదారి వసతి కూడ అంతమాత్రంగానే ఉంది. దీంతో నిత్యం ప్రజలు, విద్యార్థులు పట్టణానికి వెళ్లాంటే 5 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. గ్రామంలో మంచి నీటి బోర్లు రెండు వేశారు. కానీ ఆ నీటిలో ఫ్లోరైడు ఉండటంతో బోరుబావుల నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ గ్రామంలో చాలా మందికి గృహాలు మంజూరు కాక పూరిగుడెసెల్లోనే కాపురముంటున్నారు. గ్రామంలో మహిళలకు మరుగుదొడ్లు లేక ఇబ్బందిపడుతున్నారు. గ్రామంలో సీసీరోడ్లు లేవు. మురుగు కాలువలు లేవు. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి మజరా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఈ మజరా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయండి



సి. బెళగల్, మే 19: మండల కేంద్రంలో బస్టాండు దగ్గర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టు కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు గత 5 సంవత్సరాలను విద్యుత్ అధికారులను కోరుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర టీ హోటల్, పండ్ల అంగళ్ళు, వాహనాలతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాగలదిన్నె రీచ్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

నందవరం, మే 19: మండలంలోని నాగలదిన్నె ఇసుక రిచ్‌ను సబ్ కలెక్టర్ శర్మ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక మేట్లను చూశారు. అక్రమంగా టిప్పర్లు, ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నారా అని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ , ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శైలేశ్వర్, తహసీల్దారు ఓబులేసు, ఎస్ఐ తిమ్మయ్య, ఆర్ఐ జర్మీయా, సర్వేయర్ ముగతి శేఖర్, కార్యదర్శి పాల్గొన్నారు.

నేటి నుంచి రాయితీ వేరుశనగ విత్తన పంపిణీ

పత్తికొండ టౌన్, మే 19: ఈ నెల 20 నుంచి మండలానికి మంజూరైన సబ్సిడీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకట్రాముడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం రాయితీ వేరుశనగ విత్తనాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకొని విత్తనాలు పొందాలన్నారు. రాయితీ విత్తనాలు కావాల్సిన రైతులు అప్లికేషన్, ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకుని రావాలన్నారు. ఈ రాయితీ వేరుశనగ విత్తనాలు నల్లరేగడి భూములకు ఇవ్వబడదని, ఈ విషయాన్ని రైతులు గుర్తించాలని సూచించారు.

విత్తన కొనుగోలుకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

మద్దికెర, మే 19: మండలంలో ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసుకున్న రైతులు ఈ నెల 20వ తేదీ నుంచి రైతుభరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఉప్పర రవి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎకరా కంటే అధికంగా భూమి ఉన్న ఒక్కో రైతుకు గరిష్ఠంగా 30 కిలోల బస్తాలు మూడు ఇవ్వనున్నట్లు తెలిపారు. సబ్సిడీ పోనూ ఒక్కో బస్తాకు రూ.1710లు కట్టాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 23వరకు విత్తన కొనుగోలుకు నమోదు చేసుకోవాలన్నారు. 24 నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఈవోలు జిలానీ బాషా, జాకీర్, నాయక్, నాని, తదితరులు ఉన్నారు.

టీడీపీ గెలుపు తథ్యం

మద్దికెర, మే 19: టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు గెలుపు తథ్యమని మండల తెలుగు యువత అధ్యక్షులు ఎస్.ఉదయ్ కుమార్, మూలింటి రాము యాదవ్, జిల్లా యాదవ సాధికారికత కార్యదర్శి మూలింటి రంగస్వామి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మండలంలో జరిగిన ఓటింగ్ సరళిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ టీడీపీ వైపే ఉన్నారన్నారు. మండలంలో పోలింగైన ఓట్లు చూస్తుంటే.. ఎక్కువ శాతం టీడీపీకే పోలయ్యాయని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని, ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు, కష్టపడిన ప్రతి ఒక్కరికీ టీడీపీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు శ్రీరాములు, మంగళి రంగ స్వామి తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

మద్దికెర, మే 19: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 13న జరిగిన పోలింగ్ తర్వాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎటువంటి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ రోజున చిన్న చిన్న మనస్పర్థలు ఉంటే ఆరోజునే మరిచిపోవాలని, మరలా పునరావృతం కాకుండా చూసుకోవాలని రాజకీయ నాయకులను, ప్రజలను కోరారు. బైండోవర్ కేసులు నమోదు చేసుకున్న వారు ఎటువంటి ఘర్షణలకు పాల్పడరాదని, అలా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా బాణాసంచా కాల్చరాదన్నారు. వచ్చే నెల 4న కౌంటింగ్ అయిన తర్వాత గ్రామాల్లో సభలు, ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేయరాదన్నారు. ప్రజలందరు సహకరించాలని కోరారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, మే 19: వేసవి కాలం దృష్ట్యా ప్రతి ఒక్కరూ వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో నిరంజన్‌బాబు అన్నారు. ఆదివారం వ్యవసాయ కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ లక్షణాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షాలు కురిసి వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ తిరిగి రెండు రోజుల నుంచి ఎండలు మండిపోతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

సమస్యాత్మక గ్రామాల్లో పర్యటన

ఎమ్మిగనూరు రూరల్, మే19 : మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఉదయం, సాయంత్రం పర్యటిస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా ఘర్షణలు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లయితే తమకు సమాచారం అందజేయాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

తుగ్గలి, మే 19: వాతావరణం మార్పు వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని వైద్యులు ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన తుగ్గలి ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

క్యాన్లు, బాటిళ్లలో పెట్రోల్ నిషేధం

- పెట్రోల్ బంకులకు ఉన్నతాధికారుల ఆదేశాలు
- ఇబ్బందుల్లో ట్రాక్టర్ల యజమానులు





డీజిల్ అయిపోవడంతో పొలంలోనే నిలిచిపోయిన ట్రాక్టర్

పత్తికొండ టౌన్, మే 19: తొలకరివర్షాలు కురిసాయి. పొలాల్లో దుక్కులు ప్రారంభమయ్యాయి. పూర్వం పొలాలను ఎద్దుల కాడెతో దున్నేవారు. కాలక్రమేణా యంత్ర పరికరాలు, ట్రాక్టర్ల సహాయంతో పొలంలో వ్యవసాయ దున్నకాలు రైతులు చేపడుతున్నారు. ఇప్పటికే పొలాలను ట్రాక్టర్ల ద్వారా సేద్యం చేసుకుంటున్నారు. బాటిళ్లకు, క్యాన్లకు డీజిల్, పెట్రల్ నింపవద్దని ఉన్నతాధికారులు పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రతి రోజూ ట్రాక్టరు యజమానులు క్యాన్ల ద్వారా డీజిల్ నింపుకొని ట్రాక్టర్లకు ఉపయోగించి వ్యవసాయ పనులు సాగించేవారు. ఇలా అధికారుల ఆదేశాలు జారీ కావడంతో ట్రాక్టర్ల యజమానులు, రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పత్తికొండ మండలంలో వ్యవసాయ పనులకు దాదాపు 500 పైగా ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నారు. పత్తికొండలో నాలుగు పెట్రోల్ బంకులు ఉన్నాయి. సుదూర ప్రాంతాల్లోని పంట పొలాలకు ట్రాక్టరు వెళ్లి వ్యవసాయ దుక్కులు చేసే సమయంలో డిజిల్ అయిపోతే ట్రాక్టర్ యజపమాని తన ద్విచక్ర వాహనంపై క్యాన్‌ను నింపుకొని పొలానికి వెళ్లి ట్రాక్టర్‌కు డీజిల్‌ను నింపి వ్యవసాయ పనులు చేసేవారు. అయితే, సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని ప్రాంతాల్లో జరిగిన అల్లర్లలో పెట్రిల్ బాంబులు ఉపయోగించడంతో హింస పెట్రేగిందని అధికారులు తేల్చారు. దీంతో పెట్రోల్ బంకుల్లో వాహనాలకు మాత్రమే డీజిల్, పెట్రోల్‌ను వేయాలని, క్యాన్లు, బాటిళ్లలో నింపితే.. పెట్రోల్ బంకుల లైసెన్సులు రద్దు చేస్తామని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పెట్రోల్ బంకు యజమానులు కాన్లు, బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ తీసుకెళ్లడాన్ని నిషేదించారు. దీంతో ట్రాక్టర్ల యజమానులు తమ ట్రాక్టరు తీసుకుని వచ్చి డీజిల్‌ను నింపుకొని వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఎక్కడో పొలాల సుదూర ప్రాంతాల్లోని పొలాల నుంచి పెట్రోల్ బంకుల దగ్గరకు వాహనాలను తీసుకురావాలంటే కష్టంగా ఉందని, క్యాన్లకు నింపుకునేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయినప్పటికీ అధికారుల ఆదేశాలు పాటించకుంటే తమ లైసెన్సులు రద్దు అవుతాయని, తామేమీ చేయలేమని పెట్రోల్ బంకుల యజమానులు చేతులేత్తేశారు. దీంతో ట్రాక్టర్ల యజమానులకు తిప్పలు తప్పడం లేదు.

ట్రాక్టర్లకు సడలింపు ఇవ్వాలి

పెట్రోల్ బంకుల్లో ట్రాక్టర్లకు అధికారులు మినహాయింపు ఇచ్చి క్యాన్లలో డీజిల్ నింపేందుకు అవకాశం కల్పించాలి. పొలాలకు, పెట్రోల్ బంకులకు మధ్య దూరం దాదాపు 30 కిలోమీటర్లు ఉంటుంది. పొలం పనుల్లో ఉన్న సమయంలో డీజిల్ అయిపోతే.. అక్కడి నుంచి పెట్రోల్ బంకుకు రావాలంటే ఇబ్బందిగా ఉంటుంది. ట్రాక్టర్లకు మాత్రం అధికారులు మినహాయింపు ఇచ్చి క్యాన్లకు డీజిల్ నింపుకునేందుకు అవకాశం ఇవ్వాలి.

- తిమ్మారెడ్డి, ట్రాక్టర్ యజమాని, పెద్ద హుల్తి

జీడీపీ తాగునీటి పథకాలకు ఇక్కట్లే

- గాజులదిన్నె ప్రాజెక్టులో 0.6 టీఎంసీల నీరు మాత్రమే
- ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరని వైనం
- 120 గ్రామాలకు నీటి ఇబ్బందులే..



జీడీపీలో ఉన్న 0.6 టీఎంసీల నీరు

గోనెగండ్ల, మే 19: ఈ వేసవిలో గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న తాగునీటి పథకాలకు నీటి సమస్య రానున్నది. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 0.6 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ నీరు తాగునీటి పథకాలను 15 నుంచి 20 రోజుల వరకు మాత్రమే రానున్నాయి. ఇప్పటి వరకు కురిసిన వర్షాల కారణంగా ప్రాజెక్టు కు ఒక్క చుక్కనీరు కూడా వచ్చి చేరలేదు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి తదితర ప్రాంతాలలో పెద్దవానలు కురియక పోవడం కారణంగా ప్రాజెక్టుకు వరద నీరు చేరలేదు. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి కర్నూలు నగరానికి తాగునీరు కోసం ఎడమ కాలువ ద్వార ప్రతిరోజూ 70 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టులో నీరు రోజురోజుకు అడుగంటి పోతోంది. దీనికి తోడు నీటి ఆవిరి కూడా ఎక్కువ గానే ఉంది. ప్రాజెక్టు కింద బండగట్టు, డోన్, క్రిష్ణగిరి నీటి పథకాల ద్వారా దాదాపు 120 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. అయితే ప్రాజెక్టులో కేవలం 0.6 టీఎంసీల నీరు మాత్రమే ఉండటం భారీ వర్షం కారణంగా వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరకపోతే మరో 20 రోజులలో ప్రాజెక్టు కింద తాగునీటి పథకాలకు నీటి కొరత రానుంది. దీంతో ప్రాజెక్టు అధికారులు ఎగువ ప్రాంతాలలో వర్షం వచ్చి ప్రాజెక్టుకు వరద నీరువచ్చి చేరితే తప్ప సమస్య తీరదని చెబుతున్నారు. మరో 15 రోజుల్లో ప్రాజెక్టు ఎగుమ ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసి వరద నీరు వచ్చి ప్రాజెక్టును వచ్చి చేరాల్సింది. నీటి సమస్య వస్తే కర్నూలు నగరంతో పాటు పత్తికొండ, డోన్, క్రిష్ణగిరి మండలాలతో పాటు దాదాపు 120 గ్రామాలకు తాగునీటి సమస్య రానుంది. తాగునీటి కష్టం తీరాలంటే ఇక వర్షం పైనే ఆధారం అని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అద్దెలు ఎగ్గొట్టేశారు

- పెండింగ్ అద్దెలపై దృష్టి సారించిన అధికారులు
- ఇండోర్ స్టేడియం దుకాణదారులకు నోటీసులు



అరికేర రోడ్డులో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

ఆలూరు, మే 19: జిల్లా స్పోర్ట్స్ ఆధ్వర్యంలో అరికేర రోడ్డులో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో మూడేళ్లుగా అద్దె చెల్లించకుండా ఎగ్గొట్టడం పై దృష్టి సారించిన జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, ఈ నెల 10న నోటీసులు జారీ చేశారు.

వ్యాపారుల నిర్లక్ష్యం

వ్యాపార రీత్యా మంచి డిమాండ్ ఉన్న దుకాణాలు.. పోటీపడి మరీ టెండర్లలో దక్కించుకున్నారు. అద్దెలు కూడా ఎక్కువగా ఉండటంతో దుకాణాలను రెండుగా చేసి ఒక్క షాపును అద్దెకు ఇచ్చుకున్నారు. అయినా కూడా మూడేళ్లుగా అద్దెలు మాత్రం చెల్లించలేదు. దీంతో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ డెవలప్మెంట్ అధికారి బీ భూపతి రావ్ 6 దుకాణాదారులకు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 17 లోగా పెండింగ్‌లో ఉన్న అద్దెను చెల్లించనిపక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించడంతో, 5 నెలల అద్దె ముట్టించారు. మరో వైపు అద్దెలు కూడా అధికంగానే ఉన్నాయని. అదే గ్రామ పంచాయతీ పరిధిలో బస్టాండ్‌లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న అద్దెల కన్న రెండింతలు ఎక్కువగా ఉన్నాయని వ్యాపారులు వాపోతున్నారు.

డీఈఈ సస్పెన్షన్ కలకలం

- సూత్రధారులు ఎవరూ ?
- తీగ లాగుతున్న అధికారులు
- విద్యుత్‌శాఖలో ఆధిపత్యం సాగిస్తున్న కాంట్రాక్టర్లు



ఆలూరు విద్యుత్‌శాఖ కార్యాలయం

ఆలూరు, మే 19: ఆలూరు సబ్ డివిజనల్ విద్యుత్‌శాఖలో కీలక అధికారి డీఈఈ నాగేంద్ర ప్రసాద్ సస్పెన్షన్ తీవ్ర కలకలం రేపింది.. ఆదివారం అంతటా ఇదే విషయం పై చర్చ సాగుతోంది. అనధికార విద్యుత్ కనెక్షన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటులో డీఈఈ పాత్ర ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు.

విద్యుత్‌శాఖలో ఆధిపత్యం సాగిస్తున్న కాంట్రాక్టర్లు..

విద్యుత్ శాఖలో కొందరు కాంట్రాక్టర్లు అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. కొత్తగా వచ్చే అధికారులను మచ్చిక చేసుకొని, వారికి అవసరమైన వ్యక్తిగత పనులు చేసి, వారితో సాన్నిహిత్యం పెంచుకుంటూ, నేరుగా సెటిల్మెంట్లు చేస్తూ, అధికారులకు, వినియోగదారులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఆలూరు డీఈఈ సస్పెన్షన్‌లోనూ కాంట్రాక్టరుల పాత్ర ఉన్నట్లు సమాచారం. ముందుగానే ఇతర రాష్ట్రాల నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌లు, పోల్స్ తెచ్చి, అనధికారికంగా కనెక్షన్లు ఇప్పిస్తునట్లు తెలుస్తోంది. ఇదే కోణంలో కూడా అధికారులు తీగ లాగుతున్నారు. ఇందులో ఎవరు సూత్రధారులు...? ఎందరు పాత్రదారులు.. అనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కాంట్రాక్టర్లు మొత్తం వ్యవహారాన్ని నడిపినట్లు విద్యుత్‌శాఖలో చర్చ సాగుతోంది. వాస్తవానికి మండలానికి విద్యుత్‌శాఖలో ఒక్క కాంట్రాక్టర్ ఉండాలి. అయితే ఆలూరు సబ్ డివిజన్‌లో మాత్రం ఏళ్ల తరబడి ఇద్దరు కంట్రాక్టర్లు చక్రం తిప్పుతుండటం గమనార్హం.

మున్సిపాలిటీలో ఉద్యోగాల పేరుతో వసూళ్లు

- అధికార పార్టీ ప్రజాప్రతినిధి పై ఆరోపణలు
- సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో



ఎమ్మిగనూరు, మే19 : ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని అధికార పార్టీకి చెందిన ఓ దిగువశ్రేణి ప్రజాప్రతినిధి కొంతమంది నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఉద్యోగం కోసం రూ.లక్షల్లో డబ్బు చెల్లించి మోసపోయిన ఓ బాధితుడు తన గోడును ఆడియోరూపంలో సోషల్ మీడియాలో వెల్లగక్కాడు. కొన్ని రోజుల క్రితం ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒకొక్కరి నుంచి రూ.2 నుంచి రూ.5లక్షల వరకు మున్సిపాలిటీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి పట్టణంలోని పలువురు నుంచి అక్రమంగా వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు 70 మంది నుంచి డబ్బు వసూలు చేసినట్లు బాధితుడు తన ఆడియోలో వెల్లడించడంతో పట్టణంలో అదికాస్తా వైరల్‌గా మారింది. అయితే సదరు ప్రజా ప్రతినిధి అక్రమ వసూళ్లకు మున్సిపాలిటీకి చెందిన ఓ అధికారి సైతం వంతపాడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా మున్సిపాలిటీలో ఉద్యోగాల భర్తికి అధికారులు ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేసిన దాఖలాలు లేవు. అంతేగాక కాంట్రాక్టు బేసిక్‌పైగాని, రోజువారి వేతనంపై గాని ఎవరిని ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నట్లు కూడా అధికారులు ప్రకటించలేదు. అయినప్పటికీ కొద్ది రోజుల క్రితం మున్సిపాలిటికి చెందిన ప్రజాప్రతినిధి పలువురికి ఉద్యోగాల ఆశచూపి లక్షల కొద్ది డబ్బు దండుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మున్సిపల్ కార్యాలయం నుంచి అధికారులు మున్సిపాలిటీలో ఎలాంటి ఉద్యోగాలు లేవని, ఉద్యోగాల భర్తీకి ఎలాంటి నోటిఫికేషన్ జారీ కాలేదని, ఉద్యోగాల పేరుతో డబ్బు అడిగితే ఇచ్చి ఎవరూ మోసపోవద్దని ప్రకటనను జారీ చేయడం గమనార్హం. ఉద్యోగాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన సదరు ప్రజా ప్రతినిధిని వైసీపీ అభ్యర్థి పక్కనపెట్టుకొని తిరగడం పట్ల కూడా పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ఈ వసూళ్ల రాయుడు ఆదోనికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి నుంచి కూడా రూ.10లక్షల మేర వసూలు చేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా మున్సిపాలిటీలో ఉద్యోగాల పేరుతో అధికార పార్టీ ప్రజా ప్రతినిధి అక్రమ వసూళ్లకు పాల్పడడం పట్టణంలో చర్చనియాంశంగా మారింది.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

తుగ్గలి, మే 19: బీసీలు అభివృద్ధి చెందాలంటే.. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండాలని టీడీపీ బీసీ సెల్ నాయకులు ప్రతాప్‌యాదవ్, తలారి రాముడు, నల్లగుండ్ల రవి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బొందిమడుగులలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీలను నట్టేట ముంచిందని, ప్రతి ఒక్క బీసీకి అర్థమైందని, అందుకే ఓటుతోనే వైసీపీకి బుద్ధి చెప్పాలని, వచ్చే ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అఖండ విజయం సాధిస్తుందని, గతం మాదిరిగానే చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే గత టీడీపీ హయాంలో అందే సంక్షేమ పథకాలతో పాటు బీసీ కార్పొరేషన్ల ఏర్పాటు చేసి రుణ సౌకర్యాలు కల్పించి పేద కుటుంబాలను ఆదుకుంటానని పేర్కొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



చికెన్ షాప్‌లో అంటుకున్న మంటలు

హొళగుంద, మే 19: మండలం పరిధిలోని గజ్జెహళ్లి గ్రామంలో ఓ చికెన్ దుకాణంలో ఆదివారం గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. మధ్యాహ్నం 4 గంటల సమయంలో కోళ్లను కాలుస్తుండగా, ఒక్కసారిగా గ్యాస్ లీకై సిలండర్ మొత్తం మంట అంటుకొందని దుకాణ యజమని తెలిపారు. వెంటనే దుకాణంలో నుంచి అందరు బయటకు పరుగులు తీయడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. మండలు వ్యాప్తి చెంది ఉంటే, దుకాణంతో పాటు చుట్టుపక్కల ఉన్న గుడిసెలు సైతం అగ్నికి ఆహుతి అయ్యేదని, తృటితో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

వేసవి సెలవుల సందర్భంగా తిరుపతికి ప్రత్యేక రైలు


ఆదోని టౌన్, మే 19: వేసవి సెలవుల సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు సికింద్రాబాద్ నుంచి తిరుపతి పుణ్యక్షేత్రం వరకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్‌లో రాత్రి 10 గంటలకు బయలుదేరే ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్, గద్వాల, రాయచుర్, మంత్రాలయం మీదుగా తిరుపతికి వెళ్తుంది. ఆదోని పట్టణానికి తెల్లవారు జామున 3.10 గంటలకు చేరుకునే ఈ రైలును సెలవు రోజులలో తిరుపతికి వెళ్లే భక్తులు వినియోగించుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రుల సలహా సంఘం సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ ఆదివారం తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద, మే 19: దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు మల్లయ్య స్వామి, మహేష్ స్వామి తెలిపారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి జాలాభిషేకం, రుద్రాభిషేకం, అకుపూజ నిర్వహించినట్లు తెలిపారు. మొక్కులు తీర్చుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఐదు విద్యుత్ మోటార్లు దగ్ధం

- రూ.2లక్షల నష్టం



దగ్ధమైన విద్యుత్ మోటార్లు

మంత్రాలయం, మే 19: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డికి చెందిన ఐదు విద్యుత్ మోటార్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. తుంగభద్ర నది ఒడ్డున తమ పొలాలకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఐదు విద్యుత్ మోటార్లు, పీవీసీ పైపులు, స్టాటర్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో విద్యుత్ మోటార్లు, పైపులు, స్టాటర్లు కాలి బూడిదయ్యాయి. వీటి విలువ దాదాపు రూ.2లక్షల మేర ఉంటుందని బాదితుడు వాపోయాడు.

సుందరయ్య సేవలు మరువలేనివి

తుగ్గలి, మే 19: పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేనివని, ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన తుగ్గలిలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకొని విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలని, అప్పుడే దేశ ప్రగతికి ఉపయోగపడతారని అన్నారు. ప్రతి ఒక్కరూ సమస్యలపై పోరాటం చేయాలని, అవసరమైతే.. ఉద్యమబాట పట్టాలని, ఆ కాలంలోనే సుందరయ్య ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి జాతిని మేల్కొల్పారని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శిఖామణి, రంగస్వామి, రాముడు పాల్గొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితోనే పోరాటాలు

దేవనకొండ : కమ్యూనిష్టులు పుచ్చలిపల్లి సుందరయ్య స్ఫూర్తితోనే పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు వీరశేకర్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సుందరయ్య 39వ వర్ధంతి వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతగా ప్రజాసమస్యలపై పోరాటాలు చేశారన్నారు. ప్రజాసంక్షేమమే తన ధ్యేమని, తన సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, రమేష్, బండ్లయ్య, బలరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆశయాల సాధన కోసం కృషిచేద్దాం

ఎమ్మిగనూరు: మహోన్నత వ్యక్తి సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల సాధనకు కృషి చేద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని స్థానిక సుందరయ్య భవన్‌లో జిల్లా నాయకులు గోవిందు అధ్యక్షతన సుందరయ్య 39వ వర్ధంతిని నిర్వహించి ఘన నివాళి అర్పించారు.

ఖాదర్‌లింగ స్వామి ఉరుసు ప్రారంభం





ఉత్సవాలకు విద్యుద్దీపాలతో సుందరంగా తయారైన దర్గా, ప్రత్యేక పూలతో పూజలందుకుంటున్న స్వామి వారి సమాధి

కౌతాళం, మే 19: మండల కేంద్రమైన కౌతాళంలో హిందూ, ముస్లిం అన్న తేడా లేకుండా మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ఆదివారం నుంచి స్వామి వారి ఉరుసు ఉత్సవాలను దర్గా ధర్మకర్త పెద్ద మున్నా పాషా చిస్తి చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గా ధర్మకర్త మాట్లాడుతూ స్వామి వారి ఉరుసు ఉత్సవాలు 5రోజుల పాటు కొనసాగుతాయని ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి వారి సమాధికి గుసూల్(సుగంధ ద్రవ్యాలతో శుభ్రపరచడం)కార్యక్రమం, సోమవారం గంధం, మంగళవారం ఉరుసు, బుధవారం జియారత్ కార్యక్రమం, గురువారం సన్రా కార్యక్రమంతో ఉరుసు ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు మన రాష్ట్రం నుంచే కాక తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి స్వామి వారి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. ఇప్పటికే దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు.